: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వుల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 25 | 18-03-2024 | పుటలు : 4


# కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవం



పరిశోధన వ్యాసాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ మరియు కుసుమ ధర్మన్న కళాపీఠం హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో విశ్వవిద్యాలయ తెలుగుశాఖ నిర్వహణలో తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనం మరియు కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై ఉపన్యసించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తెలుగు సాహిత్యం దేదీప్యమానంగా వెలుగొందిన వెయ్యేళ్ళ సాహిత్య నేపథ్యాన్ని ప్రస్తావించారు. రాజమహేంద్రవరం వాసియైన కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవానికి నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావడం శుభపరిణామం అన్నారు. శతాబ్దాల చరిత్రగల సాంస్కృతిక రాజధానిలో సంఘ సంస్కరణ దీప్తిగా కుసుమ ధర్మన్న రచనలు దశ దిశలా వ్యాపించాయన్నారు. తొలి తెలుగు దళిత కవిగా నిలిచి ఆనాటి సమాజంలోని ఎన్నో లోపాలపై కలంతో పోరాటం చేసి, హరిజనోద్ధరణకై రచనలు చేసారన్నారు. మద్యపాన నిషేధం పై ధ్వజమెత్తడమే కాకుండా సమతా భావనకు, సంఘ సంస్కరణకు నడుం బిగించి అలుపెరగని పోరాటం చేసిన ఆదర్శ శిఖరం ధర్మన్న అని తెలిపారు. 1921లో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం" గేయానికి భిన్నంగా నల్ల దొరలు పాలనకొచ్చినంత మాత్రాన హరిజనులకు ఒరిగేదేమీ ఉండదని నిర్మొహమాటంగా "మా కొద్దీ నల్ల దొరతనం.. ప్రతి గేయం రాసిన తొలి దళిత విప్లవ కవి కుసుమ ధర్మన్న అని కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కుసుమ ధర్మన్న పని చేసారని అన్నారు. జయభేరి పత్రికను స్థాపించి హరిజనులను చైతన్య పరిచిన హక్కుల కోసం పోరాటం చేసారని తెలిపారు. ఒక ప్రక్క స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్న నేపథ్యంలో దళితుల అణచివేతను ప్రకటించారని చెప్పారు. అటువంటి మహనీయుని జయంతి ఉత్సవాలను తెలుగుశాఖ నిర్వహించడం సంతోషదాయకమని, ఈ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డా.రాధ కుసుమ, సదస్సు కన్వీనర్ డా. తరపట్ల సత్యనారాయణలను అభినందించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన విధానాలు తెలియజేసారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ సామాజిక ఆత్మగౌరవం చైతన్యం కుసుమ ధర్మన్న అనే అంశంపై ఉపన్యసించారు. కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యకురాలు డా.రాధకుసుమ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన కుసుమ ధర్మన్న కవి విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. సదస్సు అధ్యక్షులు ఆచార్య డి.జ్యోతిర్మయి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యాన్ని చదువుతున్న నేటి తరం వివక్షత లేని సమాజం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా.బూసి వెంకటస్వామి, వి.ఎస్.ఎం. కళాశాల తెలుగు శాఖాధిపతి డా.ర్యాలి శ్రీనివాస్, కందుకూరి వీరేశలింగం కళాశాల తెలుగు శాఖాధిపతి డా.పి.వి.బి.సంజీవరావులు కుసుమ ధర్మన్న సాహిత్య విశేషాలను తెలియజేశారు. జాతీయ సదస్సులో భాగంగా 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్ర సమర్పణ లతో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.

**డా.తరపట్లకు కుసుమ ధర్మన్న సాహితీ సేవా పురస్కారం**

కుసుమ ధర్మన్న కళాపీఠం వారిచే సాహితీ సేవ పురస్కారాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు డా.తరపట్ల సత్యనారాయణకు వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రదానం చేశారు. రాజమహేంద్రవర తీరాన వెలిసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కుసుమ ధర్మన్న సాహితీ సేవ పురస్కారాన్ని తెలుగుశాఖ అధ్యాపకులు డా.తరపట్ల సత్యనారాయణకు ప్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డా. రాధాకుసుమ తెలియజేసారు. తరువాత అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. మధ్యాహ్నం జాతీయ సదస్సులో భాగంగా 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు తమ పత్రాలను సమర్పించారు. అలాగే కుసుమ ధర్మన్న సాహితీ ప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై జాతీయ స్థాయిలో కవి సమ్మేళనంలో 53 మంది కవులు కవితా గానం చేశారు. ముగింపు సమావేశంలో సదస్సు కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తొలి దళిత కవి, వక్త, జయభేరి పత్రిక సంపాదకుడు, ఉద్యమకారుడు, ఆయుర్వేద వైద్యుడు, సాహితీ కోవిదుడు, ఆంగ్ల-ఆంధ్ర భాషల్లో పండితుడుగా కుసుమ ధర్మన్న ఎదిగారని చెప్పారు. ఎంత ఎదిగినా తన జాతిపై జరుగుతున్న వివక్షతను రూపుమాపడానికి "మాకొద్దీ నల్లదొరతనం" గేయరచయితగా ప్రసిద్ధుడయ్యారని చెప్పారు. జాతీయ సదస్సు నిర్వహణకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ, తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, సహాయాచార్యులు డా.తలారి వాసు, డా.డి.లక్ష్మీనరసమ్మ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డా.తరపట్లకు కుసుమ ధర్మన్న సాహితీ సేవ పురస్కార ప్రదానం

# నన్నయలో ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్' అంశాలపై ఎస్ ఆర్ టి స్రైస్ టెక్ ఐకాన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ హాజరై నేటి ఆధునిక సాంకేతిక యుగంలో టెక్నాలజీ యొక్క అవసరం ఎంతో పెరిగిందని అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలు అందరికీ అవసరమని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు అందరికీ సాంకేతిక ప్రగతిని పెంపొందించాలని ఆలోచనతో వీసీ ఆచార్య కె. పద్మరాజు చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారని తెలిపారు. సంస్థ సీఈవో ఎస్.వి.డి. రవితేజ, వెంకట భమిడిపాటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రిసోర్స్ పర్సన్స్ కు రిజిస్ట్రార్ సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ డా.టి. హైమావతి యూనివర్సిటీ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# వీసీని కలిసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆదివారం గ్రూప్ వన్ ప్రిలిమనరీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్ డాక్టర్ జీవీ సుధాకర్ రెడ్డి శనివారం విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. నన్నయ వీసీ ఆచార్య కె పద్మరాజు గతంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్ గా సేవలందించారు. సుధాకర్ రెడ్డి పద్మరాజులు విశ్వవిద్యాలయ అభివృద్ధి వంటి పలు అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయానికి విచ్చేసిన సుధాకర్ రెడ్డిని వీసీ పద్మరాజు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ పాల్గొన్నారు.

# సంపాదకీయం



## పిల్లలకే నాహృదయం అంకితం

ఇది రష్యాకు చెందిన  సుహొమ్లిన్ స్కీ పుస్తకం. మొదట్లో మాస్కో రాదుగ ప్రచురణాలయం నుండి ఆర్వీఆర్ (రాళ్లబండి వెంకటేశ్వరావు)గారి అనువాదంతో వెలువడింది. ప్రస్తుతం ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించారు. పుస్తక కేంద్రాల్లో దొరుకుతుంది కూడా. విద్యావిషయక భాషలో ఈ పుస్తకం తరగతి వెలుపలి బోధన కృషికి సంబంధించింది.

పెంపకాన్ని, బోధననీ ఒకే విద్యా క్రమంలో మిళితం చేయాలని చాలా కాలంగా అభ్యుదయ అధ్యాపకులు కన్న కలలను తన కృషి ద్వారా సాకారం చేసిన వ్యక్తి సూహొమ్లిన్ స్కి. తన జీవితమంతా విద్యా బోధనకే అంకితం చేశాడాయన. సమాజం కేంద్రంగానే పిల్లల్ని పెంచాలన్న మకరెంకో సమష్టి బోధన సిద్ధాంతాన్ని ఆచరణలో సాధించాడు.

ప్రతి విద్యార్థుల్లోనూ ప్రత్యేక వ్యక్తిని దర్శించడమనేది ఆయన బోధన పద్ధతిలోని నిగ్గు. విద్యార్థిలో నేర్చుకోవాలనే కోరికను జాగృతం చేయడం. స్వయం బోధనకి అభిరుచిని, క్రమశిక్షణని పెంపొందించడం అనేవి ఆయనకు ప్రధానమైనవి.తన సహాధ్యాపకులని, తల్లిదండ్రులని సంప్రదిస్తూ తన ఆలోచనలని గత కాలపు మహాదేశికుల ఆలోచనలతోనూ, జానపద యుక్తితోను సరిచూసుకుంటూ తన విద్యార్థులను అధ్యయనం చేశాడు. పాఠాలుగాని, శాస్త్రీయ ప్రాథమిక సూత్రాల అభ్యాసపు ఉపదేశ వివరణల క్రమంగాని రచయిత ఈ పుస్తకంలో వివరించలేదు.సున్నిత మానవ సంబంధాల భాషలో చెప్తే ఈ పుస్తకం ఉపాధ్యాయుని హృదయానికే అంకితం ఇవ్వబడింది.

విద్యార్థుల చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా గ్రహించాలో, వారి అభ్యసనానికి ఎలా సహాయ పడాలో, వారి శ్రమను ఎలా సులభతరం చేయాలో, వారి హృదయంలో ఉన్నత భావాల్ని అనుభూతుల్ని ఎలా జాగృతంచేసి పదిలం చేయాలో, మాతృదేశం పట్ల ప్రేమను కలిగి ఉండే వివేకాన్ని, ఆదర్శాలని ఎలా సంతరింప చేయాలో తెలియచెప్పే చాలా మంచి పుస్తకమిది.

విద్యకుగల మహత్తరశక్తిని విద్యార్థికి అందించాలనుకున్నప్పుడు అధ్యాపకుడు ఈ పుస్తకాన్ని తప్పకుండా చదివితీరాలి. 'బాగా చదువుతుంటే గాని బాగా బోధించలేం' అనే మాట ఈ పుస్తకం విషయంలో తప్పనిసరిగా వర్తింపవుతుంది.

## పల్లకడియంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్




ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం 1 ఆధ్వర్యంలో రాజానగరం మండలంలోని పల్లకడియం గ్రామంలో ఈ నెల 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు స్పెషల్ క్యాంపు నిర్వహించారు. మొదటి రోజు పల్లకడియం హై స్కూల్ విద్యార్థులకు ఆరోగ్యం మరియు పరిశుభ్రతలపై అవగాహన కార్యక్రమాలు. రెండో రోజు స్వచ్ఛభారత్, మూడో రోజు గ్రామంలో పరిశుభ్రత చదువు ఆవశ్యకతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాలుగో రోజు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. ఐదో రోజు చిన్న తరహా కుటీర పరిశ్రమల ఉపయోగాలను ఏర్పాటు విధానాలను తెలియజేశారు. ఆరవ రోజు సామాజిక పరిస్థితులపై సర్వే నిర్వహించారు చివరి రోజు అగర్వాల్ కంటి హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. పి. వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థులకు బహుమతులను సర్టిఫికెట్లను అందజేశారు. ప్రోగ్రాం కన్వీనర్ ఎన్ ఎస్ ఎస్ పి ఓ డా. అప్పలరాజు మాట్లాడుతూ వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ క్యాంప్ కు సహకరించిన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె. పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు మరియు పల్లకడియం గ్రామస్తులకు, స్కూలు ప్రధానోపాధ్యాయులు జి. కామేశ్వరరావు మరియు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు ఎంతో చురుగ్గా పాల్గొన్నారని అభినందించారు.







## గూడెంలో బయోమెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్ సదస్సు



ఆదికవి నన్నయ యూనివర్శిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ ఫిజిక్స్ డిపార్ట్మెంట్ నానోటెక్నాలజీ, బయోమెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్ పై ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ఇంటర్ డిసిప్లినరీ రంగాలలో అత్యాధునిక పురోగతిని అన్వేషించే లక్ష్యంతో జరిగిన ఈ సెమినార్ లో అధ్యాపకులు మరియు విద్యార్థులను పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ లోని ఐఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. భగవన్నారాయణ ప్రసంగించడం సెమినార్ లో హైలైట్ గా నిలిచింది. మెటీరియల్ సైన్స్ మరియు నానోటెక్నాలజీ రంగంలో విశిష్ట నిపుణుడు ప్రొఫెసర్ భగవన్నారాయణ మాట్లాడుతూ ఈ రంగంలో తాజా పరిణామాలు మరియు భవిష్యత్తు అవకాశాలపై విలువైన దృక్కోణాలను అందించారు. నానోస్కేల్ క్యారెక్టరైజేషన్ టెక్నిక్లు మరియు బయోమెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్ పురోగతి వరకు విభిన్న అంశాలను అన్వేషించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు తన ప్రసంగంలో సంక్లిష్టమైన సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో మరియు ఆవిష్కరణలను నడపడంలో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అటువంటి ఆలోచింపజేసే సెమినార్ను ఏర్పాటు చేయడంలో డిపార్ట్మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ డా.ఎఫ్రాయిమ్ బాబు మరియు ఇతర అధ్యాపకులను ఆయనను అభినందించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధికి అర్థవంతమైన సహకారం అందించడానికి విద్యార్థులు పొందిన జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రోత్సహించారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జియో సైన్స్ ఫీల్డ్ విజిట్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ జియో సైన్సెస్ వారు గురువారం ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసమై రాజమండ్రిలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ సందర్శించారు. ముందుగా ఓ.ఎన్.జి.సి. రీజినల్ జియోలాజికల్ లాబొరేటరీస్ లో కాన్ఫరెన్స్ హల్ లో సీనియర్ జియాలజిస్ట్లు చే ప్రెజెంటేషన్ ద్వారా పలు అంశాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణా గోదావరి బేసిన్, పెట్రోలియం, పెట్రోల్ గుర్తింపు ముఖ్యంగా పెట్రోల్ కి అవసరం అయిన



వాతావరణం, తగిన భూగర్భ రాళ్ల ప్రాముఖ్యత మరియు పెట్రోల్ మరియు పెట్రోలియం ప్రొడక్ట్స్ వెలికితీసే పద్ధతులు వివారించారు. మధ్యాహ్నం విద్యార్థులు ల్యాబ్స్ ను సందర్శించారు. పల్యోనోలజీ, సెడిమెంటారీ, స్పెషల్ సదిపే, సోర్స్ రాక్ లాబొరేటరీ, మడ్ లాబ్ అండ్ సిమెంటింగ్ లాబ్స్ చూసి, ఆ లాబ్స్ యొక్క విశిష్టత యంత్రాల పనితీరు తెలుసుకున్నారు. చివరిగా కొర్ లాబ్ సందర్శించారు. అందులో ఫీల్డ్ లోంచి తెచ్చిన నమునాలు చూసి వాటి గురంచి తెలుసుకున్నారు. దీనిలో విభాగాధిపతి ఆచార్య వై. శ్రీనివాసరావు, అధ్యాపకులు అప్పారావు, ఓఎన్జిసి ఉద్యోగులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.



## వీసీని కలిసిన ఫార్మాసిటికల్ డైరెక్టర్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె పద్మరాజును స్మిజన్ ఫార్మాసిటికల్స్ కంపెనీ ఎనలిటికల్ డెవలప్మెంట్ డైరెక్టర్ విష్ణు మారిశెట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, కెమిస్ట్రీ విభాగాధ్యాపకులు డా. బి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.






## ఫైనాన్షియల్ ప్లానింగ్‌పై అవగాహన

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈసీఈ విద్యార్థులకు ఇన్ సైట్స్ షేరింగ్ ని ఫైనాన్షియల్ ప్లానింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి. వెంకటేశ్వరరావు పాల్గొని సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ గా ఎంబీఏ అధ్యాపకులు డా.రవి శంకర్ జెట్టి హాజరై విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. నేటి ఆధునిక ప్రపంచంలో అభివృద్ధి సాధించాలంటే మేనేజ్మెంట్ స్కూల్స్ ను పెంపొందించుకోవాలని అన్నారు. ఈగో లను అవాయిడ్ చేస్తేనే ముందుకు సాగుతామన్నారు. ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ మేలుకొలను సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ బి. సుధాకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మంచిమాట




## గూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో సిసి రోడ్లు, సెంట్రల్ లైటింగ్ మరియు డ్రైన్ నిర్మాణానికి వీసీ ఆచార్య కె. పద్మరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో పాటు, ప్రొఫెసర్ జి.సుధాకర్ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ టి.అశోక్ ప్రిన్సిపాల్ మరియు యూనివర్సిటీ ఇంజినీర్ సూకరత్నం హాజరయ్యారు. ప్రొఫెసర్ పద్మరాజు మాట్లాడుతూ అభ్యాసానికి మరియు విద్యా నైపుణ్యానికి అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను చెప్పారు. సిసి రోడ్ల నిర్మాణం క్యాంపస్ సౌందర్యాన్ని పెంపొందించడమే కాకుండా విద్యార్థులకు మన్నికైన మరియు సురక్షితమైన మార్గాలను అందించగలదని అన్నారు. విద్యార్థులు మరియు అధ్యాపకులకు అన్ని సౌకర్యాలను అందించడంలో విశ్వవిద్యాలయం అంకితభావాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



## గూడెంలో ఫిజిక్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ



నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ లో భౌతికశాస్త్ర సహాయ ఆచార్యుడు డా.వెంకట ప్రసాద్ పట్టిసం స్పటిక పదార్థాల మీద వ్రాసిన పుస్తకాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఫిజిక్స్ లో ఎన్నో పరిశోధనలు చేసి, దాన్ని ఒక పుస్తక రూపంలో ప్రతిష్టాత్మక సహస్ర పబ్లికేషన్ నందు ప్రచురించిన డా.ప్రసాద్ ను అభినందించారు. ఇటువంటి పరిశోధన గ్రంథాలు మరిన్ని రచించాలని అన్నారు. గ్రంథకర్త డా.వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈ పుస్తకం రచనలో తనకు సహకరించిన, తన పరిశోధన మార్గదర్శి డా. కె. రామచంద్రరావుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సుధాకర్, తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తుపాకుల అశోక్, శాస్త్రవేత్త డా. జి భగవన్నారాయణ, విశ్వవిద్యాలయ అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

## భారతదేశంలో ఎన్నికల కమిషన్ చరిత్ర - లోక్ సభ ఎన్నికలు విశేషాలు

ఎన్నికల సంఘం స్థాపించబడిన సంవత్సరం
: 25-01-1950
భారత ఎన్నికల కమిషన్
: ఒక రాజ్యాంగబద్ధ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ
డైమండ్ జూబ్లీ(60 సం.) జరిగిన సంవత్సరం
: జనవరి 25-01-2011
ఎన్నికల కమిషన్ గురించిన ప్రస్తావన రాజ్యాంగంలో
: ఆర్టికల్ 324 - 329
ఇంతవరకు లోక్ సభ ఎన్నికలు ఎన్నిసార్లు జరిగాయి
: 17
మొదటి సాధారణ ఎన్నికల (1951-52)లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య : 17 కోట్ల 32 లక్షలు
2024 ఎన్నికలలో మొత్తం ఓటర్లుగా నమోదయినవారు
: 97 కోట్లు
18 వ (2024) ఎన్నికలలో కొత్త ఓటర్లుగా నమోదయినవారు
: ఒక కోటి 82 లక్షలు
18 - 19 సంవత్సరాల వయసు ఉన్న ఓటర్లు
: 21 లక్షలు
85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజనులు
: 81,87,999
100 సంవత్సరాలు దాటిన ఓటర్లు
: 2 లక్షల 18,442
ట్రాన్స్ జెండర్ ఓటర్లు
: 48,044
ఓటర్లుగా నమోదైన ప్రవాస భారతీయులు
: 1,18,439
సర్వీస్ ఓటర్లుగా నమోదయినవారు
: 19,08194
ఓటర్లుగా నమోదయిన పురుష దివ్యాంగులు
: 52,65,076
ఓటర్లుగా నమోదయిన మహిళ దివ్యాంగులు
: 35,69,933
ట్రాన్స్ జెండర్ దివ్యాంగులు
: 440
వయోజన ఓటింగ్ హక్కు 21 నుండి 18 సం.లకు తగ్గించిన రాజ్యాంగ సవరణ:61 (1989 లో)
వయోజన ఓటింగ్ హక్కు 21 నుండి 18 సం.లకు తగ్గించిన ప్రధానమంత్రి :రాజీవ్ గాంధీ
ఎన్నికల కమిషన్ కార్యాలయం పేరు
: నిర్వాచన్ సదన్
ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి
:రాజీవ్ కుమార్
నూతనంగా నియమితులైన ఎన్నికల కమిషనర్లు
: 1) జ్ఞానేశ్వర్ కుమార్
: 2) సుఖ్ బీర్ సింగ్ సంధూ
పట్టణ మరియు యువ ఓటర్ల ఓటు శాతం పెంచడం కొరకు ఎన్నికల కమిషన్ యొక్క మిషన్ థీమ్ :No Voter to be Left Behind
ఎన్నికల కమిషన్ యొక్క థీమ్
: చునావ్ కా పర్వ్: దేశ్ కా గర్వ్
(Elections: The Biggest Festival and Pride of the Nation)
ఓటర్లను చైతన్యపరచుటకు ఎన్నికల కమిషన్ రూపొందించిన షార్ట్ ఫిలిం: My Vote My Duty
ఎన్నికల కమిషన్ నియమించబడిన నేషనల్ ఐకాన్ : 1) భారతరత్న సచిన్ టెండుల్కర్
2) నటుడు రాజకుమార్ రావు

- డాక్టర్ జోసఫ్ స్టీఫెన్,
పొలిటికల్ సైన్స్, అధ్యాపకులు,
ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ కాకినాడ.



## సెమీకండక్టర్ ప్రోగ్రాం వీక్షించిన ఇంజనీరింగ్ విద్యార్థులు

దేశాన్ని సెమీకండక్టర్ల తయారీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 13న అన్నారు. సెమీకండక్టర్ల ఎకోసిస్టమ్ ప్రోగ్రామ్ ను యూనివర్సిటీ ల్యాబ్ లో ఇంజనీరింగ్ విద్యార్థులు వీక్షించారు. గుజరాత్‌లో రెండు మరియు అస్సాంలో ఒకటి కలిపి దాదాపు ?1.25 లక్షల కోట్లతో మూడు సెమీకండక్టర్ సౌకర్యాలకు శంకుస్థాపన చేసిన తర్వాత మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. “ఉజ్వల భవిష్యత్తు దిశగా మనం బలమైన అడుగు వేస్తున్నందున ఇది చారిత్రాత్మకమైన రోజు” అని మోదీ అన్నారు. ‘మేడ్ ఇన్ ఇండియా’ సెమీకండక్టర్ చిప్‌లు దేశాన్ని స్వావలంబన, ఆధునికత వైపు తీసుకెళ్తాయన్నారు. ఈ వర్చువల్ కార్యక్రమాన్ని యూనివర్సిటీ ఇంజనీరింగ్ అధ్యాపకులు విద్యార్థులు వీక్షించారు.

భారతదేశంలో లోక్ సభ ఎన్నికలు – విశేషాలు

| వరుస సంఖ్య | ఎన్నికలు జరిగిన సంవత్సరం | ఎన్నికలు జరిగిన స్థానాలు | మొత్తం ఓటర్లు (కోట్లలో) | పోలింగ్ శాతం | విజయం సాధించిన పార్టీ/ కూటమి | ప్రధానమంత్రి | సాధారణ/ మధ్యంతర ఎన్నికలు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 1951-52 | 494 | 17.32 | 44.87 | కాంగ్రెస్ (ఐ) | జవహర్ లాల్ నెహ్రూ | సాధారణ ఎన్నికలు |
| 2 | 1957 | 494 | 19.37 | 45.44 | కాంగ్రెస్ (ఐ) | జవహర్ లాల్ నెహ్రూ | సాధారణ ఎన్నికలు |
| 3 | 1962 | 494 | 21.64 | 55.42 | కాంగ్రెస్ (ఐ) | జవహర్ లాల్ నెహ్రూ/ లాల్ బహదూర్ శాస్త్రి | సాధారణ ఎన్నికలు |
| 4 | 1967 | 520 | 24.89 | 61.04 | కాంగ్రెస్ (ఐ) | ఇందిరా గాంధీ | సాధారణ ఎన్నికలు |
| 5 | 1971 | 518 | 27.42 | 55.27 | కాంగ్రెస్ (ఐ) | ఇందిరా గాంధీ | మధ్యంతర ఎన్నికలు |
| 6 | 1977 | 542 | 32.12 | 60.49 | జనతా పార్టీ | మొరార్జీ దేశాయ్/ చరణ్ సింగ్ | సాధారణ ఎన్నికలు |
| 7 | 1980 | 542 | 35.62 | 56.92 | కాంగ్రెస్ (ఐ) | ఇందిరా గాంధీ | మధ్యంతర ఎన్నికలు |
| 8 | 1984 | 542 | 40.04 | 64.01 | కాంగ్రెస్ ఐ | రాజీవ్ గాంధీ | మధ్యంతర ఎన్నికలు |
| 9 | 1989 | 543 | 49.89 | 61.95 | నేషనల్ ఫ్రంట్ | వీపీ సింగ్/ చంద్రశేఖర్ | సాధారణ ఎన్నికలు |
| 10 | 1991 | 543 | 51.15 | 55.88 | కాంగ్రెస్ (ఐ) | పీవీ నరసింహారావు | మధ్యంతర ఎన్నికలు |
| 11 | 1996 | 543 | 59.26 | 57.94 | నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్/ యునైటెడ్ ఫ్రంట్(UF) | ఏబీ వాజ్ పేయి/ హెచ్.డి దేవెగౌడ/ ఐకె గుజ్రాల్ | సాధారణ ఎన్నికలు |
| 12 | 1998 | 543 | 60.59 | 61.97 | నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) | ఏబీ వాజ్ పేయి | మధ్యంతర ఎన్నికలు |
| 13 | 1999 | 543 | 61.95 | 59.99 | నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) | ఏబీ వాజ్ పేయి | మధ్యంతర ఎన్నికలు |
| 14 | 2004 | 543 | 67.15 | 58.07 | యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (UPA) | డాక్టర్ మన్మోహన్ సింగ్ | సాధారణ ఎన్నికలు |
| 15 | 2009 | 543 | 71.70 | 58.19 | యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (UPA) | డాక్టర్ మన్మోహన్ సింగ్ | సాధారణ ఎన్నికలు |
| 16 | 2014 | 543 | 83.41 | 66.44 | నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) | నరేంద్ర మోడీ | సాధారణ ఎన్నికలు |
| 17 | 2019 | 543 | 91.20 | 67.40 | నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) | నరేంద్ర మోడీ | సాధారణ ఎన్నికలు |
| 18 | 2024 | 543 | 97+ | | ? | ? | సాధారణ ఎన్నికలు |

# కాకినాడ క్యాంపస్ లో మాక్ పార్లమెంట్ ప్రోగ్రాం



భారత ప్రభుత్వ యువజన మరియు క్రీడ మంత్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ నందు డిస్టిక్ లెవెల్ యూత్ మాక్ పార్లమెంట్ ప్రోగ్రామ్ క్యాంపస్ లోని రాజనీతి శాస్త్ర విభాగంతో కలిపి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతి శ్రీ, జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత అన్ని రంగాల్లోని ముందున్నప్పటికీ రాజకీయ రంగం వైపు చాలా కొద్దిమంది మాత్రమే మొగ్గు చూపిస్తున్నారని అన్నారు. యువత క్రియాశీలక రాజకీయాల్లో పాల్గొన్నప్పుడే భారతదేశ స్థితిగతుల్ని మరింత అభివృద్ధి సాధించగలమన్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అధ్యాపకులు డాక్టర్ ఎం నాని బాబు సమన్వయకర్తగా వ్యవహరించిన మాక్ పార్లమెంట్ లో స్పీకర్ గా రాజనీతి శాస్త్ర విద్యార్థిని ఏ.మల్లేశ్వరి, ప్రధానమంత్రిగా బల జయదీప్, అపోజిషన్ లీడర్ గా పి.వరహాలు వివిధ మంత్రిత్వ శాఖలో క్యాంపస్ విద్యార్థులు పార్లమెంటులో చర్చలు ఏ విధంగా జరుగుతుందో ఆ విధంగా ప్రస్తుతం భారతదేశంలో జరుగుతున్న వివిధ విషయాలు పలు అంశాలు మరియు యాక్ట్ లు పై క్లుప్తంగా విశదీకరించిన ప్రశ్నలు మరియు జవాబుల ద్వారా పార్లమెంట్ సెషన్ను అత్యంత శ్రద్ధగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర హెచ్ ఓ డి డాక్టర్ కే జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ కె హరిబాబు, డాక్టర్ జి గోపి, యువ కేంద్రం ప్రతినిధి సత్తిబాబు తదితర ఆధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






# తమ్మవరంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ జాతీయ సేవా సమితి యూనిట్ 1 ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ తమ్మవరం గ్రామంలో స్పెషల్ క్యాంపును వారం రోజులు పాటు నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన స్పెషల్ క్యాంపు కార్యక్రమ వివరాలను తెలియజేశారు. కాకినాడ రూరల్ తమ్మవరం గ్రామంలో ఏడు రోజులపాటు స్పెషల్ క్యాంపును నిర్వహించామన్నారు. మొదటి రోజు స్థానిక ప్రజలకు అవగాహన, స్వచ్ఛభారత్ ప్రోగ్రాం, రెండో రోజు సర్వే కార్యక్రమాలు, మూడో రోజు 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ, నాలుగో రోజు ఉచిత మెడికల్ క్యాంప్, ఐదవ రోజు మొక్కలు నాటే కార్యక్రమం ఆరో రోజు యోగ అండ్ హెల్త్ ప్రోగ్రాం, ఏడో రోజు డ్వాక్రా మహిళలతో మహిళా సాధికారత అభివృద్ధి కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ క్యాంపస్ అధ్యాపకులు ఆధ్యాపకతర సిబ్బంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ అధికారులు నాయకులు ప్రజలు పాల్గొని సహకరించారని తెలియజేశారు.








# చక్రద్వారబంధంలో ఓటు హక్కుపై అవగాహన




ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన చక్రద్వారబంధం గ్రామంలో ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని గ్రామ ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు, గ్రామ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.




# నాట్యకళాతృష్ణ, కళాప్రపూర్ణ,పద్మశ్రీ నటరాజ రామకృష్ణ జయంతి

**ప్రతిభా వాణి**

**(మార్చి 21)**

చరిత్రగతిలో బతికి జీర్ణమైపోయిన నృత్యరీతులను పునర్జీవింపజేసి, పూర్వ వైభవాన్ని మన కళ్ళ ముందు నిలబెట్టిన వ్యక్తి 'పద్మశ్రీ' నటరాజ రామకృష్ణ. 10వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్య కాలంలో ప్రాచుర్యంలో ఉన్న 'పేరిణి శివతాండవం' నాట్యాన్ని పునరుద్ధరించడంతో పాటు, ప్రబంధ నాట్య సంప్రదాయానికి సంబంధించిన 'నవజనార్ధనం',ఆలయనృత్యం వంటి ప్రాచీన నాట్యరీతుల్ని తిరిగి వెలుగులోకి తెచ్చిన నాట్యా చార్యులు రామకృష్ణ. నాట్యాన్నే జీవిత సర్వస్వంగా చేసుకొని కళకే అంకితమై, బ్రహ్మచారిగానే ఉండిపోయి, ఆరు దశాబ్దాలుగా కళామతల్లికి విశేష సేవలందించి, ప్రాచీన సంప్రదాయ నాట్య కళా రీతులను దశదిశలా వ్యాపింప జేసిన కళాదిగ్గజం రామకృష్ణ.


రామకృష్ణ తల్లి దమయంతీదేవి నల్గొండ జిల్లాకు, తండ్రి రామమోహనరావు తూర్పు గోదావరి జిల్లాకూ చెందినవారు. వీరు ఇండోనేషియా లోని బాలి ద్వీపానికి వలస వెళ్ళారు. రామకృష్ణ అక్కడే 1933 మార్చి 21 న జన్మించాడు. ఆయన చిన్నతనంలోనే తల్లి మరణించింది. వారి కుటుంబం నాగపూరుకు వలస వచ్చేసింది.

బాల్యమంతా మద్రాసు రామకృష్ణ మఠంలో గడిపి అనంతరం గాంధీ ఆశ్రమంలో పెద్దలు ప్రభాకర్.జి, ఆశాదేవి మొదలైన వారితో పరిచయాలు ఆయన జీవన విధానానికి సోపానాలైనాయి.

నటరాజ రామకృష్ణకు చిన్ననాటి నుంచే నాట్యం పట్ల ఆసక్తి కలిగింది. ఆయన నాట్యం నేర్చుకోవడం తండ్రి ఇష్టపడలేదు. "మా వంశం కళలను పోషించాలే గానీ కళాకారులుగా వాటిని ఆరాధించకూడదని వారి అభిప్రాయం" అని తన ఆత్మకథలో రామకృష్ణ గారు రాసుకున్నాడు. తాను రచించిన దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర పుస్తకానికి లభించిన కేంద్ర ప్రభుత్వ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నపుడు కూడా ఆయన సంతోషించలేదని కూడా రాసుకున్నాడు.

నటరాజ రామకృష్ణ ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని కళాసాధన చేశాడు. కుటుంబాన్నీ, సంపదల్నీ వదిలి నాట్యంకోసం జీవితాన్ని అంకితం చేశాడు. ఆయన తనలోని కళాతృష్ణాన్వేషణలో ఎందరో గురువులను కలుసుకొని, వారి నుండి ఎన్నో నాట్యరీతుల్ని నేర్చుకున్నాడు. వారిలో మీనాక్షి సుందరం పిళ్ళై, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, నాయుడుపేట రాజమ్మ, పెండెల సత్యభామలు ఉన్నారు.

18 ఏళ్ళ వయసులో నాగపూరులో ఆయనకు "నటరాజ" అనే బిరుదును ఇచ్చారు. అప్పటినుండి అది ఆయన పేరు ముందు శాశ్వతంగా చేరిపోయింది. తాండవ నృత్యం ఒక అద్భుత ప్రక్రియ అంటారు నటరాజ రామకృష్ణ గారు. శాస్త్రాన్ని, సంప్రదాయాన్ని గురుముఖంగా అధ్యయనం చేయడం వల్ల "రామప్ప" లోని భంగిమల్నీ పరిశీలించి అభ్యసించ గలిగానని ఆయన తన పుస్తకంలో రాసుకున్నారు. రూప సంపన్నుడుగా, అందాన్ని భావింప గలవాడుగా, రసానుభవం కలిగి, రక్తి కలిగించే వాడుగా, తాలజ్ఞుడుగా, గమకంలో నేర్పరిగా, ధ్వని గల శరీరం కలవాడుగా, మంచి రేఖ గలవాడుగా, వాయిద్యాలను ఎరిగిన వాడుగా వుండాలనీ, అటువంటివాడే పేరిణి నృత్యానికి తగిన వారని 'జాయప సేనాని' తన"నృత్తరత్నావళి"గ్రంథంలో పేర్కొన్న విధంగా నటరాజ రామకృష్ణ 'రామప్ప' లోని మృదంగ భంగిమల్ని పరిశీలించి, ఆ మృదంగ ధ్వనుల్ని మార్ధంగికునికి నేర్పి వాయింపజేశారు. పేరిణి తాండవాన్ని పునర్నిర్మించటానికి ఆ మాతృకలే తనకెంతో సహాయ పడ్డాయని, ప్రతి శబ్ధానికి ఉత్పత్తి, పరాకాష్ట, అంతర్ధానం అనే మూడు దశలుంటాయని, ఆ నాధోత్పత్తి, విజృంభణ నిశ్శబ్ధతలను గురించి వివరంగా తెలిసి ఉన్న నర్తకుడు ఏ రూపాన్నైనా సృష్టించగలడని నటరాజ రామకృష్ణ పేరిణి నృత్యానికొక సజీవ రూపకల్పన చేసి మన ముందుంచారు.



తెలంగాణ ప్రాంత ప్రాచీన నృత్యం అయిన పేరిణి నృత్యాన్ని "యోధుల నృత్యం" అని కూడా పిలుస్తారు. పూర్వ కాలంలో యోధులు యుద్ధ రంగానికి వెళ్ళబోయే ముందు పరమ శివుడి ముందు ఈ నాట్యాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రదర్శించే వారు. ఓరుగల్లును దాదాపు రెండు శతాబ్దాల పాటు పాలించిన కాకతీయుల హయాంలో ఈ కళ బాగా పరిఢవిల్లింది. ఈ నృత్యం మనిషిని ఉత్తేజ పరుస్తుందనీ శివుడికి నివేదనగానూ పరిగణిస్తారు. ఈ కళకు సంబంధించిన ఆధారాలు ఓరుగల్లుకు సమీపంలో ఉన్న రామప్ప దేవాలయంలో గల శిల్పకళలో గమనించవచ్చు. లయబద్ధంగా సాగే డప్పుల మోత దీనికి సంగీతం. ఈ కళాకారులు నాట్యం చేస్తూ ఆ పరమశివుణ్ణే తమ దేహంలోకి ఆహ్వానించి అలౌకికమైన అనుభూతిని పొందడానికి ప్రయత్నిస్తారు. కాకతీయుల శకం ముగియగానే ఈ కళ దాదాపుగా కనుమరుగై పోయింది. మళ్ళీ నాట్య పితామహులుగా పిలవబడే ఆచార్య నటరాజ రామకృష్ణ కృషితో మళ్ళీ వెలుగులోకి వచ్చింది. నటరాజ రామకృష్ణ పేరిణి నత్యంతో పాటు ప్రబంధ నాట్య సంప్రదాయానికి సంబంధించిన 'నవజనార్ధనం' వంటి ప్రాచీన నృత్యాన్ని (ఆంధ్ర నాట్యాన్ని) కూడా పునరుద్ధరించారు.

ఆంధ్ర నాట్యం, జానపద కళానృత్యం, 1987 లో ప్రచురితం.
అర్ధ శతాబ్ది-ఆంధ్రనాట్యం - ఆత్మకథ.
ఆంధ్రనాట్యం పరిశోధనా గ్రంథం.
దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర.
ఆంధ్రులు - నాట్యకళారీతులు ఆయన రచించిన పుస్తకాలు.
నాట్య కళకు అంతర్జాతీయఖ్యాతి తెచ్చిపెట్టిన రామకృష్ణ. జూన్ 7, 2011న హైదరాబాదులో మరణించారు.
నృత్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన నాట్యగురువు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ గారు. దేవాలయాలు కాలం ఆంధ్ర నాట్యం జీవిస్తూనే ఉంటుందని, దాని గొప్పదనాన్ని గుర్తించి రేపటి తరానికి ఈ కళ ఔన్నత్యాన్ని చాటిచెప్పన నటరాజ రామకృష్ణ
దేవాలయాలు ఉన్నంత కాలం ఆంధ్ర నాట్యం వున్నంతవరకు చిరంజీవిగానే ఉంటారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in